## క్లుప్తంగా

### వీరేశ్వరస్వామి ఆలయంలో చండీహోమం



మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో చండీ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి తిథిని పురస్కరించుకొని శుక్రవారం భద్రకాళి అమ్మవారికి చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చక స్వామి పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో పలువురు పండితులతో గణపతి పూజ, చండీ పారాయణ, చండీ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### లక్ష్మీదేవికి అభిషేకాలు



తాళ్లరేవులో లక్ష్మీదేవి అమ్మవారు

తాళ్లరేవు: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీదేవి జయంతిని శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు లక్ష్మీ సహస్రములు, అష్టోత్తర పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం చేసారు. ఈ సందర్భంగా కేశవాచార్యులు మాట్లాడుతూ లోక కల్యాణం కోసం క్షీరసాగర మథనంలో లక్ష్మీదేవి ఆవిర్భవించిన రోజును లక్ష్మీ జయంతిగా నిర్వహిస్తారని అన్నారు.

### ముత్యాలమ్మకు ఘనంగా క్షీరాభిషేకం



ముత్యాలమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

తాళ్లరేవు: పవిత్ర ఫాల్గుణ పౌర్ణమి పర్వదినం సందర్భంగా పి.మల్లవరం గ్రామ దేవత ముత్యాలమ్మ వారికి శుక్రవారం క్షీరాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ధూళిపూడి గోవిందరావు దంపతుల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం, ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పంపన రామకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ విళ్ల సత్యనారాయణ, ప్రతినిధులు ఉంగరాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో మోటార్ సైక్లిస్టుకు తీవ్రగాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లో కోరంగి వంతెన వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉన్నమట్ల గంగకు తీవ్రగాయాలయ్యాయి. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు కడియం గ్రామానికి చెందిన గంగ మట్లపాలెం ద్విచక్ర వాహనంపై వచ్చి తిరిగి వెళుతుండగా అదుపుతప్పి కోరంగి వంతెన దిగువున ఉన్న రైలింగ్‌ను బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గంగ తలకు తీవ్ర గాయమైంది. హుటాహుటిన స్థానికులు క్షతగాత్రుడిని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### 17న మాల మహానాడు సమావేశం

అమలాపురం రూరల్: ఎస్సీ వర్గీకరణ విషయంలో వన్ మ్యాన్ కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ఏకపక్షంగా ఉందని ఈనెల 17న అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లి అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో అంబేడ్కర్ కోనసీమ జిల్లా మాల మహానాడు అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు జేఏసీ కమిటీ సభ్యులు ప్రకటించారు. సరైన జనాభా లెక్కలు తేల్చకుండా మాల మాదిగల మధ్య తేడా కేవలం ఒక శాతం అంటూ దొంగ లెక్కలతో మాలలను మరోసారి మోసం చేయడానికి ప్రయత్నిస్తున్న నేపథ్యంలో అంతిమ పోరు ఏ విధంగా చేయాలన్న దానిపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. మే 10న మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు జయంతిని పురస్కరించుకుని ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా కాకినాడలో నిర్వహించ తలపెట్టిన ప్రభుత్వంపై అంతిమ పోరు భారీ బహిరంగ సభ విజయవంతంపై చర్చిస్తామన్నారు.

### 17 నుంచి అసెంబ్లీ సమావేశాలు

యానాం: పుదుచ్చేరి 2025–26 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం ఈనెల 12న వాయిదా పడ్డ అసెంబ్లీ సమావేశాలు తిరిగి ఈనెల 17నుంచి తిరిగి ప్రారంభమవుతాయని స్పీకర్ ఆర్ సెల్వం శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 14న మాసీ మహాత్మా పండుగను పురస్కరించుకుని సెలవు కావడంతో పాటు శని, ఆదివారాలు సైతం సెలవుగా ప్రకటించినట్లు తెలిపారు. ఇప్పటికే బడ్జెట్ ఆమోదంతో పాటు లెఫ్టినెంట్ గవర్నర్‌కు ధన్యవాదాలు చెప్పే తీర్మానంపైన చర్చ జరిగిందన్నారు.

# గీత దాటితే... జరిమానాల మోత

- కొత్త నిబంధనలు అమలుపై పోలీసుల కసరత్తు
- అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో విస్తృత ప్రచారం
- యానాం నుంచి వచ్చేవారిపై ప్రత్యేక గురి




గొల్లవిల్లిలో వాహనదారుల కొత్త నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ ప్రసాద్, అమలాపురం సీఐ ప్రశాంత్ కుమార్ (ఫైల్)

ఐ.పోలవరం: వాహనచోదకులూ జర జాగ్రత్త. నూతనంగా రూపొందించిన ట్రాఫిక్ నిబంధనలను నిర్లక్ష్యంగా బేఖాతర్ చేశారో నిఘా నేత్రాలకు చిక్కి జరిమానాల బాదుడు భరించాల్సిందే. పుదిచ్చేరి యానాంలో పెట్రోల్ ధరలే కాదు. మద్యం ధరలు కూడా తక్కువే. అలా అని మోటార్ సైకిల్, కారులో పెట్రోల్ పోయించుకున్నట్టుగా మద్యం సేవించి వాహనం నడిపారంటే తస్మాత్ జాగ్రత్త. ఇక నుంచి భారీ జరినామా చెల్లించాల్సిందే. యానాం నుంచే అని కాదు.. ఎక్కడ మద్యం సేవించి బండి నడిపినా పోలీసులు జరిమానా కొరడా ఝుళిపించనున్నారు. రానున్న వారం రోజుల్లో కొత్తగా రూపొందించిన నిబంధనలను పోలీసులు పక్కాగా అమలు చేస్తే సామాన్యులపై జరిమానాల భారం పడనుంది.

**వాహన చట్టాలు కఠినతరం**

ర్యాలీలు, పుట్టిన రోజు వేడుకలు పేరు చెప్పి వాహనాల సైలెన్సర్లు తీసి వాహనాలు నడపడం కూడా ప్రతి చోట జరిగేదే. హెల్మెట్ లేకున్నా, ట్రిపుల్ రైడింగ్ చేసినా, సైలెన్సర్లు తీసినా, డ్రైవింగ్ లైసెన్స్, వాహన బీమా లేకున్నా, ఓవర్ స్పీడ్‌గా వాహనాలు నడిపినా జరిమానా తప్పదని పోలీసులు అంటున్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం నూతన మోటారు వాహన చట్ట నిబంధనలను అనుసరించి వాహన చట్టం ఉల్లంఘన కేసుల్లో భారీగా జరిమానాలు విధించనున్నారు.

**విస్తృతంగా ప్రచారం**

కొత్త నిబంధనలపై అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో పోలీసులు, రవాణా శాఖ అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. జరిమానాల తాలూకా ఫ్లెక్సీలను పట్టణ ప్రధాన రహదారులు, కూడళ్లలో పోలీసులు ఏర్పాటు చేశారు.

**యానాం నుంచి వచ్చేవారిపై ప్రత్యేక నిఘా**

కాకినాడ– అమలాపురం మధ్య వాహనాల మీద రాకపోకలు సాగించేవారిలో చాలా మంది పుదిచ్చేరి యానాంలో మద్యం సేవిస్తుంటారు. వీరి వల్ల అటు తాళ్లరేవు, ఇటు ఐ.పోలవరం, ముమ్మిడివరంలో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. 216 జాతీయ రహదారిపై సాయంత్రం నుంచి ప్రయాణం అంటే ఇతర వాహన చోదకులు భయపడుతున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టనున్నారు.

**జరిమానాలు ఇలా..**

| | |
|---|---|
| హెల్మెట్ లేకపోతే... | రూ.1,000 |
| వెనుక కూర్చున వ్యక్తికి హెల్మెట్ లేకపోతే.. | రూ.1,000 |
| డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే.. | రూ. 10,000 |
| వాహనానికి బీమా లేకపోతే.. మొదటిసారి | రూ.1,000 |
| రెండవసారి | రూ. 2,000 |
| శబ్దం – పొగ కాలుష్యానికి పాల్పడితే.. | రూ.2,000 |
| డేంజరస్ పార్కింగ్ | రూ.1,500–3,000 |
| రేసింగ్ (ఓవర్ స్పీడ్) | రూ.5,000 |
| డేంజరస్ డ్రైవింగ్ | రూ. 10,000 |
| మైనర్ డ్రైవింగ్ | రూ.1,000 |

**అవగాహన కల్పించేందుకు ప్రత్యేక డ్రైవ్**



కొత్త చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. యానాం నుంచి మద్యం సేవించి వచ్చేవారిపై బ్రీత్ అనలైజర్స్ పెట్టి చెక్ చేసి కేసులు నమోదు చేస్తున్నాం. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు కొత్త చట్టంపై అవగాహన కల్పిస్తున్నాం.

– ఎం.మోహన్ కుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ముమ్మిడివరం

### హోమియోపతి వైద్యానికి ప్రత్యేక స్థానం



పేరూరులో వైద్యశిబిరంలో పాల్గొన్న సర్పంచ్ దాసరి అరుణ

అమలాపురం రూరల్: ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యంలో ఉన్న హోమియోపతి వైద్య విధానానికి ఒక ప్రత్యేకత ఉందని సర్పంచ్ దాసరి అరుణ, మాజీ సర్పంచ్ పెచ్చెట్టి చంద్రమౌళి అన్నారు. పేరూరు బేతాళ స్వామి గుడి వద్ద శుక్రవారం డాక్టర్ కేర్ హోమియోపతి ఆస్పత్రి వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య హోమియో శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోమియోపతి వైద్య విధానంలో దీర్ఘకాలిక వ్యాధులకు మాత్రమే చికిత్స ఉంటుందనే అపోహతో సాధారణ వ్యాధులకు ఈ వైద్య విధానాన్ని ప్రజలు ఆశ్రయించడం లేదని వారన్నారు. హోమియోపతి వైద్య విధానంపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలని సూచించారు. సీనియర్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సామ్యూ ల్ హానిమాన్ అనే వ్యక్తి హోమియోథెరపీ స్థాపకుడని అన్నారు.ఈ శిబిరానికి 200 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరిత, దాసరి డేవిడ్, జల్లి శ్రీను, మేనేజర్ కిషోర్ పాల్గొన్నారు.

## కోలాటం గురువుకు సత్కారం



కోలాటం గురువు రామకృష్ణను సత్కరిస్తున్న బాలమిత్ర సంఘ అధ్యక్షుడు తదితరులు

అమలాపురం రూరల్: బండారులంకలో శ్రీనివాసా బాల మిత్ర సంఘం ఆధ్వర్యంలో, గురువు ఏటూరి రామకృష్ణ నేతృత్వంలో గురువారం రాత్రి శ్రీనివాసా కోలాట భజన మండలి గజ్జెల పూజ, కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది. వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద కోలాట సమాజ బృందాలతో ఆధ్యాత్మిక కోలాట నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గురువు రామకృష్ణను, శిక్షకులు మధు, మణిని బాలమిత్ర సంఘ అధ్యక్షుడు చింతపట్ల బాబు, శిష్య బృందం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప్పుగంటి భాస్కరరావు, బళ్ల స్వామి వివేకానంద, మాచారమ్మ, కార్టూనిస్ట్ మాడా రాము, అంకం పెద రాజు, లక్కింశెట్టి ఫణి రాజు, పూటుకూరి అన్నపూర్ణ, ఆశపు కనక మహాలక్ష్మి, చింతా వసంతరాణి పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ముస్లింల ఉపవాస దీక్ష



అమలాపురం ముల్లా ముస్తాఫా మసీదులో రంజాన్ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

అమలాపురం టౌన్: పవిత్ర రంజాన్ మాసంలో అమలాపురంలోని ముల్లా ముస్తాఫా, జామీనా మసీదుల్లో పట్టణ ముస్లింలు రోజా ఉపవాస దీక్షలతో పాటు సాయంత్రం ఇఫ్తార్ ప్రార్థనలు భక్తి శ్రద్ధలతో చేస్తున్నారు. రంజాన్ మాసంలో రెండు శుక్రవారం రావడంతో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ ప్రత్యేక ప్రార్థనల కోసం స్థానిక ముల్లా ముస్తాఫా మసీదులకు రాజస్థాన్ రాష్ట్రం జయపూర్ నుంచి వచ్చిన ముస్లిం గురువు ఇమామ్ మొహ్మద్ రజా రంజాన్ మాసం విశిష్టతను, ఆరాధ్యదైవమైన అల్లా బోధనలను ప్రార్థనల రూపంలో వివరిస్తున్నారు. ముల్లా ముస్తాఫా మసీదు పెద్దలు ఎండీ అమీర్, షేక్ అబ్దుల్ ఖాదర్, ఎండీ ఆజామ్, ఎండీ బషీర్, ఎంఎంకే మొహిద్దీన్, జీఎం ఖాన్, అలీ, వలీ, మహ్మద్ తదితరులు రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు.

### క్షత్రియ సామాజిక వర్గంపై చంద్రబాబు వివక్ష

అమలాపురం టౌన్: ఎమ్మెల్సీ పదవులు కేటాయింపులో కూటమి ప్రభుత్వం వివక్షత చూపుతోందని కోనసీమ క్షత్రియ సేవా సంఘం కోఆర్డినేటర్ ఇందుకూరి నరసింహరాజు ఆరోపించారు. ఈ మేరకు ఆయన అమలాపురంలో శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మకు గత ఎన్నికల్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎమ్మెల్సీ ఇస్తామని ప్రకటించి మరీ మోసం చేశారని ధ్వజమెత్తారు. పవన్ కల్యాణ్ పిఠాపురం నుంచి ఎమ్మెల్యేగా నెగ్గారంటే అది వర్మ కృషేనని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యంగా చంద్రబాబు క్షత్రియ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా వివక్ష చూపుతున్నారని ఆయన ఆరోపించారు.

### వైభవంగా కోదండ రాముని విగ్రహ పునఃప్రతిష్ఠ

తాళ్లరేవు: పటవల పంచాయతీ రాఘవేంద్రపురంలో కోదండ రాముని విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గొర్రిపూడి గ్రామానికి చెందిన వేద పండితులు పూజ్యం మల్లికార్జునశర్మ నేతృత్వంలో ఉదయం 10.34 గంటలకు సీతా సమేత కోదండ కల్యాణ రాముడు, లక్ష్మణుడు, హనుమంతుడు, అదే విధంగా షిర్డీ సాయినాథుని విగ్రహాలను ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజల అనంతరం గోవుకు ప్రథమ దర్శనం కల్పించారు. అనంతరం భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఈ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు.భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పినపోతు చినకామేశ్వరరావు, నాయకులు కొత్తూరు కాశీ ఈశ్వరుడు, దంగేటి అన్వేష్, భజన సత్తిబాబు, రెడ్డి సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

## డ్రైవర్లపై వేధింపులు తగవు



అమలాపురం డిపో వద్ద ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ డిపోలో డ్రైవర్లపై వేధింపులకు నిరసనగా యునైటెడ్ వర్కర్స్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. 25వ రోజు శుక్రవారం గేట్ మీటింగ్‌లో నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.రాంబాబు మాట్లాడుతూ అమలాపురం డిపోలో 1/19 సర్క్యులర్ అమలు చేయాలని, అక్రమంగా సస్పెన్షన్‌కు గురైన డ్రైవర్ బీఎస్ నారాయణను విధుల్లోకి తీసుకోవాలని, రాజోలు నుంచి వచ్చిన డ్రైవర్ కేజీ రావు డ్రైవర్ కం కండక్టర్ డ్యూటీకి వెళ్లాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఆదేశాలను గౌరవించి డ్రైవర్ డ్యూటీకి మాత్రమే పంపాలని డిమాండ్ చేశారు. డిపోలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో యాజమాన్యం ఘోరంగా విఫలమైందన్నారు. వాటర్ ప్లాంట్ బాగు చేయించి రాబోయే వేసవికి కార్మికులకు, ప్రయాణికులకు మంచినీటి సౌకర్యం కల్పించాలని, మరుగుదొడ్లను పరిశుభ్రతగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్టీసీ ఉద్యోగులకు వసతి రూమ్‌లు కల్పించాలని యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉప కార్యదర్శి రంగప్రసాద్ డిమాండ్ చేశారు. ఇద్దరు డ్రైవర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో అధ్యక్షుడు హౌలియా డిమాండ్ చేశారు.

## గ్రామాల్లో హోలీ సందడి



అమలాపురంలో హోలీ వేడుకతో నృత్యం చేస్తున్న పురుషులు, మహిళలు

అమలాపురం టౌన్: హోలీ వేడుకలు అమలాపురంలో శుక్రవారం ఉదయం ఉల్లాసంగా, ఉత్సాహంగా నిర్వహించారు. పట్టణంలోని మెయిన్ రోడ్డు, ముమ్మిడివరం గేటు సెంటరు, యర్రమల్లి వారి వీధి తదితర ప్రాంతాల్లో హోలీ వేడుకల సందర్భంగా యువత రోడ్లపై ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలో ఉత్తర రాష్ట్రాల నుంచి వ్యాపార రీత్యా పట్టణంలో కొన్నేళ్లుగా స్థిరపడ్డ మార్వాడీ కుటుంబాల వారు ఈ వేడుకల్లో అధికంగా పాల్గొని సందడి చేశారు. కొందరైతే ఆనందంతో నృత్యం చేశారు. హోలీ గీతాలను రాగ యుక్తంగా పాడి అలరించారు. ముందు డప్పుల వాయిద్యాలతో ఊరేగింపు సాగగా తర్వాత హోలీ వేడుకలు నిర్వహించే వారి నృత్యాలతో సాగింది.

### బంగారం, నగదు చోరీ

అమలాపురం రూరల్: తాండవపల్లి గ్రామ పరిధి శెట్టిపల్లి వనువులమ్మ ఆలయం సమీపంలో గురువారం అర్ధరాత్రి ఒక ఇంట్లో దొంగలు చొరబడి చోరీకి పాల్పడ్డారు. అమలాపురం తాలూకా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తట్టవర్తి వెంకటరత్నం 13వ తేదీన ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లారు. మరుసటి రోజు శుక్రవారం తెల్లవారు జామున వచ్చేసరికి ఇంటి తాళాలు తీసి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలో దాచిన రూ.10వేలు నగదు, ఎనిమిది గ్రాముల బంగారం బిస్కెట్ మాయమైనట్లు గుర్తించారు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. వెంకటరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సీహెచ్. ఏసుబాబు తెలిపారు.

### 17న మోటార్ సైకిళ్ల వేలం

అమలాపురం రూరల్: అమలాపురం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో 2021 ఆగస్టు 9న వేర్వేరు ప్రదేశాల్లో స్వాధీనం చేసుకున్న 8 మోటార్ సైకిళ్లను వాటి యజమానులు వివిధ కారణాల వల్ల వదిలివేశారని ఎస్సై శేఖర్‌బాబు తెలిపారు. 40 నెలలుగా విచారణ చేసినప్పటికీ వారి నుంచి ఏ విధమైన సమాచారం లభించలేదన్నారు. దీంతో ఈ వాహనాలను 17న సోమవారం తహసీల్దార్ ఆధ్వర్యంలో అమలాపురం తాలూకా పోలీస్టేషన్ వద్ద వేలం నిర్వహిస్తామని ఎస్సై తెలిపారు. ముందుగా సోమవారం ఉదయం 9 గంటలలోపు పేర్ల నమోదు చేసుకుని డిపాజిట్ కట్టి వేలంలో పాల్గొనవచ్చని ఎస్సై సూచించారు.

### ఉపాధ్యాయుడి కుటుంబానికి డీఈవో పరామర్శ



ఉపాధ్యాయుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న డీఈవో సలీమ్ బాషా, ఉపాధ్యాయులు

అమలాపురం టౌన్: స్థానిక కొంకాపల్లి జవహర్ లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పీఎస్ అసిస్టెంటుగా పనిచేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఉపాధ్యాయుడు కుదురెళ్ల సుబ్రహ్మణ్యేశ్వరరావు కుటుంబాన్ని డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా శుక్రవారం పరామర్శించారు. స్థానిక దుడ్డివారి అగ్రహారంలోని ఆ ఉపాధ్యాయుడి ఇంటికి డీఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఘనసత్యనారాయణ తదితరులు వెళ్లి ఆ బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. మృతి చెందిన ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యేశ్వరరావుకు ప్రభుత్వం నుంచి రావాల్సిన లబ్ధి వేగంగా మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని డీఈవో బాషా ఉపాధ్యాయుడి భార్య చిట్టి రత్నానికి హామీ ఇచ్చారు. సహచర ఉపాధ్యాయులు బీఎస్ వెంకటేశ్వరరావు, పీవీఎల్ఎస్ శ్రీరామ్ తదితరులు బాధిత ఉపాధ్యాయుడి కుటుంబాన్ని పరామర్శించారు.

## పేదలకు మడత మంచాల వితరణ



పేదలకు మడత మంచాలు పంపిణీ చేస్తున్న జేసీఐ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ (జేసీఐ) శాఖ ఆధ్వర్యంలో స్థానిక యల్లమిల్లివారి వీధిలో మహిళలకు కుట్టుమిషన్లు, పేదలకు మడత మంచాలను ఆ చాంబర్ ప్రతినిధులు శుక్రవారం పంపిణీ చేశారు. జేసీఐ జాతీయ ఉపాధ్యక్షుడు సిద్ధార్థ భట్నాగర్ పర్యటన సందర్భంగా అమలాపురం శాఖ ఈ వితరణ కార్యక్రమాలు చేపట్టింది. జేసీఐ ఆధ్వర్యంలో వ్యక్తివికాస శిక్షణ తరగతులతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు అమలాపురం శాఖ అధ్యక్షురాలు శ్రీవాణి వాడ్రేవు పేర్కొన్నారు. జేసీఐ లక్ష్యాలు, వితరణ కార్యక్రమాలను జాతీయ ఉపాధ్యక్షుడు సిద్ధార్థ భట్నాగర్ వివరించారు. కార్యక్రమంలో జేసీఐ రాష్ట్ర అధ్యక్షుడు టి.భరత్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జేఎస్‌ఆర్ అరవింద్, జేసీఐ అమలాపురం శాఖ కార్యదర్శి ప్రవీణ్ చిర్రావూరి, పూర్వ అధ్యక్షులు శ్రీరామ్ వాడ్రేవు, మాకిరెడ్డి పూర్ణిమ, ముఖ్య సభ్యులు ఆకొండి వవన్‌కుమార్, మాకిరెడ్డి మనోజ్, ఆకొండి చాణిక్య పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులను అడ్డుకోవడం దురదృష్టకరం



ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్

యానాం: పారిశుధ్య పనులు, డంపింగ్ యార్డు స్థలం కేటాయింపు, తదితర అభివృద్ధి పనులకు సంబంధించి అనుమతులు రాకుండా అడ్డుకుంటూ యానాంలో చెత్తను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయడం దురదృష్టకరమని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు ఆధ్వర్యంలో ఓల్డేజ్ హోమ్ సంస్థ పారిశుధ్య పనులు కాంట్రాక్టు తీసుకున్నప్పుడు కరోనా వైరస్‌తో అనేక మంది చనిపోతున్న సమయంలో 3 నుంచి 4 నెలల పాటు బిల్లులు రాలేదనే సాకుతో పారిశుధ్య పనులు ఆయన నిలిపివేసారన్నారు. దీంతో రూ.లక్షల వ్యయంతో కార్మికులను తీసుకువచ్చి యానాంలో యుద్ధప్రాతిపదికన పారిశుధ్య పనులు చేయించిన విషయం యానాం ప్రజలు, అధికారులకు తెలుసని అన్నారు. వాటన్నింటినీ మర్చిపోయి కృష్ణారావు ప్రగల్భాలు పలుకుతూ అసత్య ప్రచారం చేయడాన్ని ప్రజలంతా గ్రహిస్తున్నారన్నారు.

### హోరాహోరీగా క్రికెట్ టోర్నమెంట్

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురంలో నిర్వహిస్తున్న డీఎస్‌ఆర్ మెగా క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. టేకుమూడి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల రెండవ రోజైన శుక్రవారం పలు జట్ల మధ్య హోరాహోరీగా పోటీలు జరిగాయి. ధూళిపూడి బాబి, జక్కల ప్రసాద్, నిమ్మకాయల మూర్తి పాల్గొన్నారు.

### వైభవంగా చక్రతీర్థం

యానాం: భూసమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం చక్రతీర్థం వైభవంగా నిర్వహించారు. ఏటా స్వామివారి రథయాత్ర అనంతరం చక్రతీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా చిన్నా సెంటర్ నుంచి వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు పందిరిలో వివిధ చిరువ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేశారు. అంతకుముందు యానాంలోని గౌతమీ గోదావరిలో స్వామివారికి నిర్వహించిన చక్రస్నానం కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. మద్దింశెట్టి సత్తిరాజు కుమారుడు డాక్టర్ ఎంవీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో చంద్రవాహనం సేవ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కాకినాడ మార్కెటింగ్ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, అర్చకులు పాల్గొన్నారు.

## ఆక్వా చెరువుల తవ్వకాలను నిలిపివేయాలి



అయినాపురంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ముమ్మిడివరం: అయినాపురం అవుట్ పాల్ స్లూయిస్ సమీపంలో అక్రమంగా ఆక్వా చెరువులు తవ్వి ఆ మట్టిని ట్రాక్టర్లపై తరలించడాన్ని నిరసిస్తూ గ్రామస్తులు శుక్రవారం రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. సర్పంచ్ మోకా రామారావు ఆధ్వర్యంలో గ్రామస్తులు ట్రాక్టర్లు తిరుగుతున్న రోడ్డుపై టెంట్ వేసి బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అక్రమ చెరువుల వల్ల పర్యావరణం దెబ్బతింటుందని, పంట భూములు బీడు భూములుగా మారుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 40 ట్రాక్టర్లతో మట్టిని తరలించడం వల్ల గ్రామంలో రోడ్లు దెబ్బతింటున్నాయని, రేయింబవళ్లు ట్రాక్టర్లు విచ్చల విడిగా తిరగడం వల్ల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని ఆరోపించారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలను నిలిపి వేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## క్రీడానైపుణ్యాలు పెంచుకోవాలి



స్పోర్ట్స్ డే వేడుకల్లో పాల్గొన్న టీచర్లు, విద్యార్థులు

యానాం: గ్రామీణ క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడం ద్వారా రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలని ప్రధానోపాధ్యాయుడు కర్రి భవానిప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం దరియాలతిప్ప డాక్టర్ కేఆర్ నారాయణన్ ప్రభుత్వ హైస్కూల్లో వార్షిక స్పోర్ట్స్ డే వేడుకలను వ్యాయామ ఉపాధ్యాయుడు వినకోటి సన్యాసిరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడారంగానికి ప్రాధాన్యతనివ్వాలన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వాలీబాల్, క్రికెట్, కబడ్డీ తదితర పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ అధ్యక్షుడు సబ్బతి శ్రీనివాస్, టీచర్లు పి రామచంద్రరావు, కె పవన్, ఆనంద్‌బాబు, లక్ష్మీకాంతం, సుజాత, ప్రసన్న, దుర్గేశ్వరీ, గౌసీయా పాల్గొన్నారు.

### రేపు ఏఎంవీఐ పోస్టులకు రాత పరీక్ష

యానాం: ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్‌లో ఖాళీగా ఉన్న జూనియర్ ఇంజనీర్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ) పోస్టుల రాత పరీక్షను ఈనెల 16 ఆదివారం నిర్వహిస్తున్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ శాఖ కార్యదర్శి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ పంకజ్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పుదుచ్చేరిలో భారతీదాసన్ ప్రభుత్వ ఉమెన్స్ జూనియర్ కళాశాలలో రాత పరీక్ష ఉంటుందని, ఉదయం పేపర్ 1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, పేపర్ 2 మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ వెంట హాల్‌టికెట్‌కు పాస్‌పోర్టుసైజు ఫొటోను అతికించి, ఏదైనా గుర్తింపు కార్డు తేవాలన్నారు. వివరాలకు 0413–2233338 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.